క్లుప్తంగా

ఇంటింటికీ కుళాయి పనులు



గంగాదేవిపేటలో కుళాయిల ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని గంగాదేవిపేటలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు గురువారం చేపట్టారు జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.40 లక్షలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఈమేరకు సంబంధిత పనులను శరవేగంగా చేపడుతున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాండ్రేగుల నాగేంద్ర, కొలుసు వెంకటప్పారావు, బోడపాటి వెంకటరావు బాబ్జీ పాల్గొన్నారు.

19న గంగాలమ్మ ఆలయ ప్రతిష్ట



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న గంగాలమ్మతల్లి గుడి

మునగపాక: మూలపేటలో ఈ నెల 19న గంగాలమ్మ తల్లి గుడిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల విరాళాలతో ఆలయ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. 19న ఉదయం 8.47గంటలకు ఆలయ ప్రతిష్టకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ముఖద్వారం ప్రారంభం

గంగాలమ్మ తల్లి ఆలయ ముఖద్వారాన్ని శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూలపేటకు చెందిన మొల్లేటి శంకర్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు పరమేశ్వరరావు–మాణిక్యం దంపతుల సొంత నిధులతో ముఖద్వారం ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు.

ఏకగ్రీవంగా సర్పంచ్‌ల సంఘం ఎన్నిక



ఎస్.రాయవరం మండలం సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గం

ఎస్.రాయవరం : మండలంలో సర్పంచ్‌ల సంఘం ఎన్నిక గురువారం మండల సర్పంచ్‌లు వమ్మవరం చినగుమ్ములూరు వేదికగా నిర్వహించారు. ఓ ప్రయివేటు తోటలో మండల సర్పంచ్‌లంతా సమావేశమై ఎన్నిక నిర్వహించారు. ఇందులో తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీంతో రెండో దఫా అధ్యక్షుడిగా ఆయన ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కోశెట్టి వెంకటరమణ, కార్యదర్శిగా మైలపల్లి శ్రీను, సహాయ కార్యదర్శిగా శానాపతి శ్రీరాములు, కోశాధికారిగా వైబోయిన పద్మ, సహాయ కార్యదర్శులు పాలపర్తి పాపారావు, ఉద్దండ నాగశ్రీదేవి, సభ్యులుగా ధూళి శ్రీనివాస్, కురందాస్ గణేష్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాద్రి యాదవ్ , తోటి సర్పంచ్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



కోటవురట్లలో ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల : ఈ-పంట నమోదు తప్పనిసరని మండల వ్యవసాయాధికారి భీమిరెడ్డి సరోజిని తెలిపారు. మండలంలో ఆర్బీకేలలో గురువారం ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తాము పండించే ప్రతీ పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. అలా చేసినపుడే ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే పరిహారం అందుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బందికి పంట వివరాలు అందజేసి త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ-పంట నమోదుకు భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ నానిబాబు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

- చెత్త,చెదారంతో మురుగు కూపంలా...
- సర్పాలు, విషపురుగులు, దోమలకు ఆవాసం
- భయాందోళనకు గురవుతున్న జనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గాంధీనగరం రెండో వీధిలోని ఓ ఖాళీ స్థలంలో పరిస్థితి



గాంధీనగరం మొదటి వీధిలో ఖాళీస్థలంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు



సమితి ఆఫీసు వీధిలో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీస్థలం

యలమంచిలి రూరల్ : యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25 వార్డుల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీస్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో పిచ్చి మొక్కలు,కంపచెట్లు,పొదులు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిలో సర్పాలు, విషపురుగులు,దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడంతో సంచారం అధికమైంది. ఈ ఖాళీ స్థలాల్లో చుట్టుపక్కల వారు, ఇతరులు వ్యర్థాలు,చెత్త వేస్తున్నారు. కొన్నిచోట్ల పక్కనున్న ఇళ్లనుంచి మురుగునీరు ఖాళీ స్థలాల్లోని వదులుతున్నారు. దీంతో ఖాళీస్థలాలు మురుగు కూపాలుగా మారి,దోమలకు ఆవాసాలుగా ఉంటున్నాయి.విషకీటకాలు,పాములు సమీపంలో నివాసగృహాల వద్దకు సంచరిస్తుండడంతో అక్కడి వారంతా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.

ఖాళీ స్థలాలు కొని వదిలేస్తున్నారు..

వృత్తి,వ్యాపార,ఉద్యోగ రీత్యా దూర ప్రాంతాల్లో స్థిరపడిన కొందరు, స్థానిక రియల్టర్లు ఎన్నో ఏళ్ల క్రితం తక్కువ ధరకు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేసి వాటి ధర పెరుగుతుందనే ఉద్దేశంతో అలాగే వదిలేశారు. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి, పల్లంగా ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోయి మురుగు నీరుగా మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతూ సమీపంలో ఇళ్లలో నివాసముంటున్న వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమ కాట్లతో తరచూ రోగాల బారిన పడుతున్నామని పలువురు స్థానికులు వాపోతున్నారు. ఖాళీ స్థలాలను యజమానులు సక్రమంగా నిర్వహించుకునేలా చూడాల్సిన బాధ్యత పురపాలక అధికారులపై ఉందని,అయినా వారు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంటోందని ఖాళీ స్థలాలతో ఇబ్బందులు పడుతున్న జనం ఆవేదన చెందుతున్నారు.

775 ఖాళీ స్థలాలు

పట్టణంలో సుమారు 775 ఖాళీ స్థలాలకు అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 100కు పైగా ఖాళీ స్థలాలకు యజమానులెవరో తెలియకపోవడంతో పన్ను అసెస్‌మెంట్లు వేయడం కుదరలేదని మున్సిపల్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలాల పన్ను వసూళ్ల ద్వారా ఏడాదికి సుమారుగా రూ.32.47లక్షలు ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతోంది. అయినప్పటికీ ఖాళీ స్థలాల నిర్వహణపై పురపాలక సంఘం అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలున్నాయి.ఖాళీ స్థలాల నిర్వహణపై వాటి యజమానులు కూడా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. పట్టణంలో గాంధీ నగరం మొదటి,రెండు వీధుల్లో చిట్టడవుల్లా ఉన్న ఖాళీస్థలాల్లో విష సర్పాలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఎంపీడీవో ఆఫీసు వీధిలో ఖాళీ స్థలానికెదురుగా ఉన్న ఇంట్లోకి 10 అడుగుల జెర్రిగొడ్డు చొరబడింది. ఇంట్లో టీవీ టేబుల్ కిందకు వెళ్లి అక్కడే ఉండిపోవడంతో దానిని పట్టుకునేందుకు స్థానికంగా ఉన్న ఒక స్నేక్ కేచర్‌ను పిలిపించారు. ఆ పాముని పట్టుకోవడానికి రూ.2వేలు వసూలు చేశాడు. నిత్యం తమ కళ్లెదురుగానే భారీ సర్పాలు సంచరిస్తుండడంతో ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందోనన్న భయాందోళనతో బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నామని గాంధీ నగరానికి చెందిన లక్ష్మి,సుబ్బారావు చెప్పారు. గాంధీ నగరం మొదటి, రెండు వీధులు, రాంనగర్,ఏఎస్ఆర్ కాలనీ,శేషుకొండ కాలనీ,టిడ్కో గృహ సముదాయం, ఎర్రవరం,కొత్త ఎర్రవరం,కొత్తపేట తదితర వీధుల్లో పాముల సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గాంధీనగరం మొదటి వీధిలో రైల్వేస్టేషన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన స్థలం కోర్టు వివాదంలో ఉంది. వివాదం కారణంగా రెండు పార్టీలు ఈ స్థలాన్ని పట్టించుకోకుండా వదిలేశాయి. దీంతో ఆ స్థలంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పాములు,తేళ్లు,ఇతర విషపురుగులు ఇక్కడ ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇక్కడకు సమీపంలో రైల్వేస్టేషన్ ఉంది. రైలు ప్రయాణికులంతా వెళ్లేటపుడు రోడ్ల పై విష సర్పాల నడుమ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా దగ్గర్లో ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ రహదారి మీదుగా వచ్చి వెళ్తుంటారు. వీరందరినీ కూడా పాముల భయం వెంటాడుతోంది.

పాముల బెడద ఎక్కువైంది

రాత్రి పూట పాములు,విషపురుగుల బెడద ఎక్కువైంది. రోడ్లపై నడిచి వెళ్లేవారికి పాములు సంచరిస్తూ కనిపిస్తున్నాయి. ఇటీవల మా ఇంటి వద్దకు వచ్చిన నాగుపామును ఇటుక బెడ్డలు,టైల్స్ ముక్కలతో కొట్టి చంపాము. వర్షం పడినా,కరెంటు లేకపోయినా ఇంట్లోంచి బయట అడుగుపెట్టలేని పరిస్థితి ఉంటోంది. ఖాళీ స్థల యజమానులపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపడితే ఈ పరిస్థితి ఉండదు.

–లక్ష్మి,గృహిణి,గాంధీనగరం రెండో వీధి

చెత్త వేస్తున్నారు

ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతోంది. సమీపంలో నివాసం ఉంటున్న వారే కాకుండా ఇతర వీధుల్లో వారు కూడా ద్విచక్రవాహనాలపై చెత్తను తెచ్చి ఇక్కడ ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. వద్దని చెప్పినా దురుసుగా మాట్లాడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి వారి స్థలాలను శుభ్రంగా ఉంచుకోమని చెప్పాలి. మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లపై చూపే శ్రద్ధ ప్రజల సమస్యలపై చూపి పరిష్కరించాలి.

–పి.రంగసాయి,విశ్రాంత ఉపాధ్యాయుడు, గాంధీనగరం మొదటి వీధి

ఖాళీ స్థలాల నిర్వహణ బాధ్యత యజమానులదే

పురపాలక సంఘం పరిధిలో ఖాళీ స్థలాల నిర్వహణ బాధ్యత వాటి యజమానులదే. ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడి ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటాం. మొత్తం ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలంటే మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి సహకరించదు. యజమానులు తమ స్థలాల చుట్టుపక్కల నివసిస్తున్న వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. నిర్లక్ష్యం చూపితే అటువంటి యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తాం

–డి ప్రభాకర్రావు, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : నర్సింగబిల్లి 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం 33 కేవీ పురుషోత్తపురం ఫీడర్ పరిధిలో నర్సింగబిల్లి నుంచి పురుషోత్తపురం వరకు విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనులు శుక్రవారం చేపడతామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ స్థానిక మీడియాకు తెలిపారు. ఈ కారణంగా పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం, పీఎన్ఆర్‌పేట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అదే విధంగా పీఎన్ఆర్‌పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవకాశం ఉన్న మేరకు సరఫరా ఇస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మునగపాక: వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గృహ, వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

జెండా పండగ సందర్భంగా ఆటల పోటీలు



బోదిగల్లంలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

నక్కపల్లి : స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆటల పోటీలను హెచ్ఎం సత్యనారాయణ ప్రారంభించారు. విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరుగు పందెం, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్‌వంటి పోటీలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఉల్లాసంగా ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఆటపాటల ద్వారా దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశ్యమన్నారు. ఉపాధ్యాయులు ఆచార్యులు, ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

అధినేతతో ఆత్మీయంగా...



జగన్‌ను కలిసిన పాయకరావుపేట నేతలు



జగన్‌మోహన్‌రెడ్డికి వెంకన్న చిత్రపటం బహూకరణ



జగన్‌తో నక్కపల్లి, కోటవురట్ల జెడ్పీటీసీలు, నాయకులు





మాజీ సీఎంతో వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు, రాంబిల్లి మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు ధూళి వెంకి



పార్టీ అధినేతతో మునగపాక పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో గురువారం పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు కలిశారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, కాపుకార్పొరేషన్ మా జీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల జెడ్పీటీసీలు గోసల కాసులమ్మ, సిద్దాబత్తుల దేవి, కాకర దేవి, ఎంపీపీలు రత్నం, ఇసరపు పార్వతి తాతారావు, రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీతబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాబూరావు ఉన్నారు.

మునగపాక: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని నివాసంలో మండల పార్టీ నాయకులు కలిశారు. వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, మునగపాక పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షులు కాండ్రేగుల జగన్ తదితరులు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ నేతృత్వంలో జగన్‌ను కలిశారు.

ఎస్.రాయవరం : విజయవాడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మండల నాయకులు గురువారం కలిశారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు వెంట జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, బొండా వెంకటలక్ష్మి, వెంకటలక్ష్మి, శానాపతి రాము, గరగా శ్రీను ఉన్నారు.

రాంబిల్లి (యలమంచిలి):మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని రాంబిల్లి మండలం వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు ధూళి వెంకి గురువారం సాయంత్రం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు

అనకాపల్లి: మండలంలోని 250 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని ఇంకా ఎవరైనా కౌలు రైతులు మిగిలిపోయి ఉంటే తక్షణమే తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ సర్వేయర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు కౌలు రైతులను తక్షణమే గుర్తించి, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,600 ఎకరాలకు గాను ఈ పంట నమోదు చేయాలని సూచించారు. రైతుల పంట రుణాలకు, సున్నా వడ్డీకి, రైతు భరోసా, విత్తనాలు, ఎరువుల సరఫరా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోతే పరిహారానికి ఈ పంట నమోదు తప్పనిసరన్నారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

అనకాపల్లి: విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, రాజా ఆప్టికల్స్ సంయుక్తంగా ఈ నెల 15న మండలంలోని ఏఎంఏఎల్ హైస్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రాజా ఆప్టికల్స్ ప్రతినిధి పి.రాజా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, ఉచిత శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

ఈకేవైసీ, ఈ-పంట నమోదుపై అవగాహన పెంచాలి

మునగపాక:రైతులకు ఈకేవైసీపై అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు కోరారు. ఒంపోలు రైతు భరోసా కేంద్రంలో గురువారం వీఏఏలకు ఈకేవైసీ, ఈ పంట నమోదుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

ఈ పంట నమోదు పక్కాగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుమంత

రాంబిల్లి (యలమంచిలి): మండలంలో ఈ పంట నమోదు పక్కాగా జరిగేలా చూడాలని వ్యవసాయాధికారులు,రెవెన్యూ అధికారులకు మండల వ్యవసాయాధికారి సి.సుమంత, రాంబిల్లి డిప్యూటీ తహసీల్దార్ శేషు కోరారు. గురువారం పంచదార్ల తుఫాన్ భవనంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి ఈ పంట నమోదు ఏవిధంగా చేయాలనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండల వ్యవసాయాధికారి సి.సుమంత , డిప్యూటీ తహసీల్దార్ శేషు మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో కొత్తగా రీ సర్వే జరిగిన 11 గ్రామాల్లో ల్యాండ్ పార్సల్ నంబరు ఆధారంగా రైతుల భూమిని జియోఫెన్సింగ్ ద్వారా యాప్‌లో పంట నమోదు చేయాలని, మండలంలో 87 కౌలు రైతుల ల కార్డులకు లక్ష్యానికి అనుగణంగా 60 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం జరిగిందని డిప్యూటీ తహసీల్దార్ శేషు అన్నారు. ఈ పంట నమోదు ఏవిధంగా చేయాలనే దానిపై కంప్యూటర్ ఆన్‌లైన్‌లో అధికారులకు క్లుప్తంగా ఆమె వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలో వ్యవసాయశాఖ సహాయకులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు, వీర్వోలు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు



వాహనాలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

నక్కపల్లి : గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయరహదారిపై వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఎస్ఐ సన్నిబాబు, స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలసి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే అన్ని వాహనాలను తనిఖీ చేశారు. కార్లు, వ్యాన్‌లు, బస్సులను సైతం పోలీసు తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారి మీదుగా గంజాయి రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఈ వాహనాల తనిఖీ చేయడం జరుగుతోందని చెప్పారు. గంజాయితో పాటు నిషేధిత వస్తువుల రవాణాలను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కార్యదర్శి



రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రంథాలయంలో సభ్యుల వివరాలు పాఠకుల కోసం అందుబాటులో ఉంచి పుస్తకాలను గురించి ఆరా తీశారు. గ్రంథాలయానికి జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్న గ్రంథాలయాధికారి కె.జానర్దన్‌ను అభినందించారు. పాఠకులకు, విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

లాలంకోడూరు సర్పంచ్‌గా రుత్తల గుణాకర్



గుణాకర్‌ను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు

రాంబిల్లి (యలమంచిలి): లాలం కోడూరు గ్రామ సర్పంచ్‌గా ఉప సర్పంచ్ రుత్తల గుణాకర్‌ను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియమించినట్టు రాంబిల్లి ఎంపీడీవో వెంకటాచలం, గ్రామ కార్యదర్శి నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల లాలం కోడూరు గ్రామ సర్పంచ్ లాలం రమణమూర్తి అనారోగ్యంతో మృతి చెందగా ఉప సర్పంచ్ అయిన రుత్తల గుణాకర్‌ను ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నియమించినట్టు తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన రుత్తల గుణాకర్‌ను రాంబిల్లి మండలం వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, లాలం రమణమూర్తి భార్య లాలం శైలజ, వార్డు మెంబర్లు, కండిపల్లి పోతురాజు, నోట్ల పోతురాజు, లాలం లక్ష్మణ, రుత్తల చిన్నమ్మలు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాలం కోడూరు గ్రామాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు.

తోటాడలో ఉచిత కంటి వైద్య శిబిరం



తోటాడలో కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్నదృశ్యం

మునగపాక:మండలంలోని తోటాడ పాలకేంద్రం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి డాక్టర్ శ్రీ వినియా సేవలందించారు. 78మంది రోగులు శిబిరానికి హాజరుకాగా 30మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించినట్లు క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. కాగా శిబిరాన్ని మాజీ సర్పంచ్ దాడి వీర మహలక్ష్మినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి



ఈ-క్రాప్ నమోదుపై వీఆర్వో. వీఏవోలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి రూరల్: ఈ ఖరీఫ్ సీజన్‌లో వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రభాకర్ సూచించారు. గురువారం ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ తాజా మార్గదర్శకాల ప్రకారం ఈ-క్రాప్ నమోదు పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. నమోదు సమయంలో సంబంధిత రైతు ఆధార్ వివరాలు, భూమి పాస్ పుస్తకంలో ఉన్న భూమి సర్వే నంబరు, సాగుదారుని వివరాలు, రైతు మొబైల్ నంబర్‌ను తనిఖీ చేసి నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియకు సంబంధించిన సందేహాలను యలమంచిలి మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.